క్లుప్తంగా

వైభవంగా మల్లాలమ్మ దేవి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకారంలో మల్లాలమ్మ అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని చిన్నచెరువు కట్ట వద్ద వెలసిన శ్రీ మల్లాలమ్మ దేవస్థానం పంచమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, ఆకుపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి మహా మంగళహారతులు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాడుగుల నాగేంద్రశర్మ, దేవస్థానం నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహం


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: విజయవాడలో గతనెల 26వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రతిభ చాటిన గోస్పాడు మోడల్ స్కూల్ పాఠశాల ఒకేషనల్ విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతులు అందించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్‌ఈఆర్‌టీ, సమగ్ర శిక్ష పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ హుసేన్, ప్రొగ్రాం మేనేజర్ గోపాల్ తదితరులు అభినందించారు.

పదోన్నతి ఉపాధ్యాయులకు సర్దుబాటు రద్దు చేయాలి


మాట్లాడుతున్న విజయరావు

గోస్పాడు: ఇటీవల పదోన్నతి పొందిన పాఠశాలల సహాయకులకు సర్దుబాటును రద్దు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కోర్టు సమస్యలు పరిష్కారమయ్యేటట్లుగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. వేసవి సెలవులో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని తెలిపారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉపాధ్యాయునులను కాకుండా ప్రత్యేకంగా వార్డెన్స్‌ను నియమించాలన్నారు. సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి


మాట్లాడుతున్న రామచంద్రారావు

నంద్యాల(అర్బన్): సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీ జేఏసీ అమరావతి నంద్యాల జిల్లా చైర్మన్ రామచంద్రారావు కోరారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామచంద్రారావు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు విడుదల చేసి 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఆర్ఎస్ఏ కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షులు విజయశేఖర్, మోహన్‌రావు, సుబ్రమణ్యం, రామనరసింహ, శివారెడ్డి, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం


బీసీ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్ కృష్ణ

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్‌స్కూల్ సమీపంలో ఉన్న బీసీ కాలనీలో రూ. 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పనులు ప్రారంభించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మనందరెడ్డి ఎంపీ ల్యాండ్స్ నిధులు కేటాయించడంతో పనులు ప్రారంభించామన్నారు. కాలనీలో 517 మీటర్ల పొడువున మురికి కాలువ నిర్మాణం పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్ ఉన్నారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- రోజురోజుకు పెరుగుతున్న ఎండలు
- పాల దిగుబడిపై ప్రభావం
- మృత్యువాత పడే ప్రమాదం
- కొద్దిపాటి జాగ్రత్తలతో పశువుల సంరక్షణ


ఎండ వేడిమికి చెట్ల కింద సేద తీరిన పశువులు

గోస్పాడు: భానుడు విజృంభిస్తున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గ్రాసం కోసం బయట తిరిగే పశువుల పరిస్థితి దారుణంగా ఉంది. నోరులేని పశువులు అనారోగ్యానికి గురైతే పశుపోషకులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. వేసవిలో ఎండ తీవ్రతకు పశువులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది. పశు పోషకులు వాటిని గుర్తించి ప్రథమ చికిత్స అందించే చర్యలు చేపట్టాలి. కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బకు గురి కాకుండా పశువులను కాపాడుకోవచ్చని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. వేసవిలో వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడమే గాక పశువులు ఎదకు వచ్చే పరిస్థితి కనిపించదని, అంతేగాక పశువులు చూడు కట్టే అవకాశం ఉండదని చెబుతున్నారు. 2018 పశుగణన లెక్కలప్రకారం జిల్లాలో 1,20,565 ఆవులు, ఎద్దులు, 2,93,830 బర్రెలు, 8,82,449 గొర్రెలు, 3,05,854 మేకలు ఉన్నాయి. పశు పోషణతో ఉపాధి పొందుతున్న రైతులు వాటిని ఎండల బారి నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికంగా ఉంటుంది. తద్వారా చెమట ద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత పెరగడంతో పాటు శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్ర విసర్జన కూడా కుంటు పడుతుంది. పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

వడదెబ్బకు గురైతే లక్షణాలు ఇలా..

- వడదెబ్బకు గురైన పశువుల లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది.
- పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాస క్రియ ఎక్కువగా ఉంటుంది.
- పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కోసారి కిందపడి కొట్టుకొని స్పృహ కోల్పోతాయి. పశువు నీటి కొరకు ఎదురు చూస్తుంది.
- పశు చర్మం సున్నితత్వం కనిపిస్తూ గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది.
- నీడ కోసం చెట్టుకింద చేరి కూలబడుతాయి. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి ఒక్కోసారి మరణిస్తాయి.
- వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసార వ్యాధి వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు..

- వేసవిలో పశువులను ఎక్కువగా ఎండ సమయంలో బయటకు వదలకూడదు.
- ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయాల్లో మాత్రమే పశువులను మేత కోసం బయటకు వదలాలి.
- ఎక్కువ శాతం పచ్చిమేతను పెట్టాలి. ఎండు మేత లేదా దాణను నీటి తడిపి పెట్టవచ్చు.
- పశువులకు రోజుకు మూడు నాలుగు సార్లు చల్లని నీటితో కడగాలి.
- గేదెలకు 60–70లీటర్లు, ఎద్దులకు 90 నుంచి 100లీటర్ల వరకు మంచినీళ్లు తాపాలి.
- సూడి పశువులకు చివరి త్రైమాసికంలో మేత కొరకు బయటకు వదలకుండా ఇంటి దగ్గరే మేత ఏర్పాటు చేయాలి.
- సేద్యపు ఎద్దుల చేత వీలైనంత తక్కువ పని చేయించుకోవాలి.
- ఎండ అధికంగా ఉన్న సమయంలో వాటిని నీడలో సేద తీరేలా చూసుకోవాలి. నీరు, విశ్రాంతి ఎక్కువగా ఇవ్వాలి.
- నాటు జాతి పశువుల కంటే సంకర జాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి.
- గాలి బాగా ప్రసవించేటట్లు ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి.
- రేకులు, కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న సమయంలో నీటిని చల్లాలి.
- పశువులు ఈ కలుషితమైన నీటిని తాగితే వ్యాధి కాలక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధులు కలిగే అవకాశం ఉండటంతో శుభ్రంగా ఉండే నీటిని ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి.

చికిత్స విధానం ఇలా



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి, వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లని నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారులను సంప్రదించి చికిత్స చేయించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్లతో పాటు సెలైన్లను ఇప్పించడం వల్ల శరీరానికి సరిపడ గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువు నీరసనం నుంచి బయట పడతాయి. ఒక్కసారి వడదెబ్బ తగిన పశువుకు గతంలో మాదిరిగా పాల దిగుబడి ఉండే అవకాశం ఉండదు. సరైన జాగ్రత్తలతో ప్రయోజనం చేకూరుతుంది.

– కిశోర్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి

భూసార పరీక్షతో ప్రయోజనాలు


మట్టి నమూన పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

దొర్నిపాడు: భూసార పరీక్షతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు సూచించారు. భూ పరీక్ష-శిక్షణావారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాలో 10 నుంచి 15 ప్రదేశాల్లో మట్టిని సేకరించి భూసార పరీక్ష చేయించాలన్నారు. భూసార విలువను బట్టి పొలాల్లో ఎరువులను ఏ మోతాదులో వేయాలో ఏ పంట వేస్తే దిగుబడులు మంచిగా వస్తాయో తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ వంశీకృష్ణ, ఎంపీఈఓ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరం సమీపంలో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడ్డాడు. రుద్రవరానికి చెందిన మనోహర్ సొంత పని మీద శిరివెళ్లకు బైక్ వెళ్లి వస్తూ పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చేసి మెరుగైన వైద్యం కోసం వైద్యులకు నంద్యాలకు రెఫర్ చేయగా కుటుంబీకులు తరలించారు.

సీసీ, బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలి

- పొదుపు గ్రూపు చెంచు మహిళలు


హరినగరంలో సమావేశమైన పొదుపు గ్రూపు సంఘాల మహిళలు

రుద్రవరం: పొదుపు మహిళల సొమ్ము కాజేసిన సీసీ, బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని హరినగరం గ్రామానికి చెందిన చెంచులక్ష్మి గ్రామైక్య సంఘంలోని మహాలక్ష్మి, గృహలక్ష్మి గ్రూపు సభ్యులు కోరారు. ఈ రెండు సంఘాల సభ్యులు శ్రీనిధి నుంచి రూ.3.50 లక్షలు రుణం తీసుకున్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వైఎస్సార్ క్రాంతి పథం సభ్యులు తిరుపాల్, దిల్‌షాద్ సూచనల ప్రకారం నిర్ణీత మొత్తంతో పాటు వడ్డీ చెల్లిస్తూవచ్చారు. రూ.3.50 లక్షల అసలు వడ్డీ కింద రూ.70 వేలు చెల్లించారు. అప్పు తీరిందని ఇటీవల ప్రస్తుత సీసీ చంద్రపాల్ వద్దకు వెళ్లి తమకు ఉన్నతి కింద రుణం ఇప్పించాలని కోరారు. కాగా ఇంకా రూ.60 వేల బాకాయి ఉందని, మొత్తం చెల్లించినా తర్వాతనే రుణం ఇప్పిస్తామని చెప్పడంతో చెంచు మహిళలు అవాక్కయ్యారు. మంగళవారం రెండు గ్రూపు సభ్యులు సమావేశమై గతంలో చెల్లించిన డబ్బులకు రసీదులను పరిశీలించగా, వడ్డీతో సహా మొత్తం కట్టినట్లుగా ఉండటంతో మోసపోయినట్లు తెలుసుకున్నారు. తమ డబ్బులు కాజేసిన గతంలో పని చేసిన సీసీ దిల్‌షాద్, బుక్‌కీపర్ తిరుపాల్‌పై పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేస్తామని, స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామని చెప్పారు. ఈ విషయంపై ఏపీఎం ప్రసాదును వివరణ కోరగా విచారణ జరిపి చెంచు మహిళలకు న్యాయం చేస్తామన్నారు.

ఉపాధి కూలీలు త్వరగా ఇంటికి చేరుకోవాలి


చిన్నకంబలూరు వద్ద ఉపాధి కూలీలకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

రుద్రవరం: ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బ బారిన పడకముందే త్వరగా ఇళ్లకు చేరుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఉపాధి కూలీలకు సూచించారు. చిన్నకంబలూరు సమీపంలో సాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మస్టర్ చదివి హాజరు వేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. ఉపాధి కింద కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.272 కూలి వస్తుందని అన్నారు. ఎండలు మండుతున్నందున ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి 10 గంటల లోపు ఇళ్లకు చేరుకోవాలన్నారు. పనులు చేయించడంపై కూలీలకు అవగాహన కల్పించాలని మేట్లకు సూచించారు. అనంతరం ఆయన చిన్నకంబలూరులోని గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏపీఓ ప్రతాప్ ఉన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర


గంగమ్మకు బోనాలు తెస్తున్న మహిళలు

శిరివెళ్ల: కాదరబాదర గ్రామంలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుల మతాలకతీతతంగా ప్రజలు తరలి వచ్చి గంగమ్మకు పూజలు చేశారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకొని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. తమ గ్రామాన్ని చల్లగా చూడాలని, వర్షాలు బాగా పడి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. సోమవారం రాత్రి గంగమ్మ జీవిత చరిత్ర గానం జరిగింది. ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, వైఎస్సార్‌సీపీ శిరివెళ్ల, దొర్నిపాడు మండలాల నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, బత్తుల నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పీఎం శ్రీ పథకానికి మోడల్ స్కూల్ ఎంపిక

మహానంది: పీఎం స్కూల్స్ రైజింగ్ ఫర్ ఇండియా (పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో తిమ్మాపురం మోడల్ స్కూల్‌కు చోటు దక్కినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మండలానికి ఒక పాఠశాల చొప్పున 56 పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. అందులో భాగంగా తిమ్మాపురం మోడల్ స్కూల్ ఉందన్నారు. ఈ పథకం ద్వారా కొత్త జాతీయ విద్యా విధానం అమలుతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సామగ్రి, బోర్డులు, తరగతి గదుల్లో ఆన్‌లైన్ వ్యవస్థ లాంటి సౌకర్యాలు కలుగుతాయని చెప్పారు.

‘ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్’పై శిక్షణ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థులకు ‘ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్’పై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ముంబై ఇస్కాన్ టెంపుల్ నుంచి హరిప్రభు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆలోచనలు మార్చుకుని విజయాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బడీరాత్

జూపాడుబంగ్లా/పాములపాడు: రంజాన్ మాసంలో వచ్చే బడీరాత్‌ను మంగళవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి, రాత్రి మేలుకొని అల్లాహ్‌ను ప్రార్థించడం వల్ల వెయ్యి నెలల పాటు అల్లాను స్మరించినంత పుణ్యఫలం లభిస్తుందని ముస్లిం మతపెద్దలు పేర్కొంటున్నారు. అందుకోసమే బడేరాత్ దినాన ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండి అల్లాను స్మరించుకుంటారని తెలిపారు. ఈ దినాన్ని లైలతుల్ అనికూడా అంటారని, ఈ రాత్రికి ఎంతో విశిష్టత ఉందంటున్నారు. ఈ దినాన దేవదూతలు భువిపైకి వచ్చి అల్లాహ్ కోసం ప్రార్థించేవారికి శుభాభినందనలు తెలుపుతారని వెల్లడించారు.

స్పెషల్ మిఠాయిలు

నందికొట్కూరు: పెద్దరాత్రి సందర్భంగా తినుబండారాల దుకాణాలు మంగళవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో వెలిశాయి. జిలేబి, ఖాజా, లడ్డూ, మైసూర్ పాక్, బాదుషాలను చక్కెర, బెల్లంతో తయారు చేసి విక్రయిస్తున్నారు. ముస్లిం సోదరులు దుకాణాల వద్దకు చేరుకున్ని జిలేబి, ఖాజా, లడ్డు, మైసూర్ పాక్ .. ఏ రకం తీసుకున్న కిలో రూ. 160 చొప్పున విక్రయిస్తున్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేరుతున్నాయని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రూరల్ మండలం అహోబిలం గ్రామంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నాసారి ప్రసాద్, సర్పంచ్ నాసారి వీరమ్మ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి రాత్రి 10 గంటల వరకు గడగపను సందర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటూ అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కారం చేశారు. మరికొన్ని సమస్యలు తొందరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ పర్యటన కొనసాగించారు. సంక్షేమ పథకాలపై ఆ కాలనీల్లో ప్రజలు 100 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాసారి వెంకటేశ్వర్లు, మధు, మద్దిలేటి, రామచంద్రుడు, బాలయ్య ఉన్నారు.

82 మసీదుల్లో ఎమ్మెల్యే శిల్పా ఇఫ్తార్ విందు


ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రారెడ్డికి కృతజ్ఞలు చెబుతున్న ముస్లింలు

నంద్యాల: రంజాన్ పండుగ సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వారం రోజుల్లో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో 82 మసీదుల్లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు పట్టణంలోని మసీదుల్లో ఇఫ్తారు విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే శిల్పా రవికి ముస్లిం సోదరులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్ ఆజాద్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి భగవంతుడు ప్రసాదించిన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇఫ్తారు విందు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసం లేని వారు ఒకరికి ఇఫ్తారు ఇవ్వాలని ఉందని, అలాంటిది వేలాది ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శిల్పా ఇఫ్తారు విందు ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు.

పశుగ్రాసం దగ్ధం

కొత్తపల్లి: మండలంలోని మునలమడుగు గ్రామంలో పశుగ్రాసం దగ్ధమైంది. మునలమడుగు గ్రామంలోని ముస్లిం కాలనీలో షఫీ ఉల్లా అనే వ్యక్తి పశువుల కోసం కల్లంలో గడ్డివామి ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పు పెట్టడంతో కాలిపోయింది. గమనించిన గ్రామస్తులు మంటలను అదుపు చేశారు. గ్రామస్తుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పీ వేశారు. పశుగ్రాసం కాలిబడిదవ్వడంతో సుమారు రూ.50 వేలవరకు రైతకు ఆస్తీ నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ఎండ తీవ్రత భారీగా ఉన్నందున సోమవారం ఎదురుపాడు గ్రామంలో మంగళవారం మునలమడుగు గ్రామంలో పశుగ్రాసాలు దగ్ధం కావడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

‘జగనన్నే మా భవిష్యత్’కు విశేష స్పందన

- 36వ వార్డులో సర్వే చేసిన కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డి


సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజల నుంచి తెలుసుకుంటున్న కౌన్సిలర్ శిల్పా నాగినిరెడ్డి

నంద్యాల: ‘జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని శిల్పా సేవా సమితి చైర్‌పర్సన్, 36వ వార్డు కౌన్సిలర్ శిల్పానాగినిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 36వ వార్డులో ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికి వెళ్లి గత పాలన, ప్రస్తుత పాలన గురించి ప్రజలకు వివరించి సంక్షేమ పథకాలపై సంతృప్తి స్థాయిని నమోదు చేశారు. అనంతరం శిల్పానాగినిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం, రాజకీయం చూడకుండా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఇంటికి వెళ్లి తెలుసుకుంటున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ప్రతి పక్ష నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రంగనాయడు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని రామకృష్ణ విద్యాలయం సమీపంలో ఆక్రమణకు గురవుతున్న ఖాళీ మున్సిపల్ స్థలంలో ప్రెస్ క్లబ్, అంబేడ్కర్ ఆడిటోరియంను నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. ఆక్రమణలకు గురవుతున్న రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని మంగళవారం సీపీఐ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీకి 1966లో నివర్తి వెంకటసుబ్బయ్య, శ్రీనివాస హౌసింగ్ పేరిట లే అవుట్ చేసి ఇచ్చారన్నారు. అప్పటి నుంచి రామకృష్ణ విద్యాలయం విద్యార్థులు ఆ స్థలాన్ని ఆట స్థలంగా ఉపయోగించుకుంటున్నారన్నారు. ఆట స్థలంగా ఉన్న ఆ స్థలంలో 2006లో రైతు బజార్‌గా ఉంటే హైకోర్టు ద్వారా ఖాళీ చేయించి మున్సిపల్ అధికారులకు ఆ స్థలాన్ని అప్పగించారన్నారు. వారం రోజులుగా ఆ స్థలంపై వివాదాలు చెలరేగుతుండటం శోచనీయమన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, సోమన్న, నాగరాముడు, ధనుంజయుడు, భాస్కర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.